## హై హైస్కూల్! హై బ్యూటిఫుల్!



# ఫేర్‌వెలు పార్టీలో కొటేషన్లు అదుర్స్

ఫేర్‌వెలు పార్టీ అంటే స్వీటూ కారా, తాగేదానికి కూల్‌డ్రింకు, ఒక గ్రూపు ఫోటో, పాడగలిగే వాళ్లుంటే రెండు మూడు పాటలు, ఎవుడైనా మిమిక్రీ చేస్తే అది కూడా... అంతేనబ్బా మాకు తెలిసింది.

అయితే యిప్పుడు జరుగుతున్న పార్టీ అట్టాంటిట్టాంటి పార్టీ కాదు. అసలికే మేమందరం మా ఇస్కూలు వొదిలిపెట్టి పోతా ఉన్నాము. మళ్లీ రమ్మన్నా రాము. అందు కని టెన్తుకిలాసు పిలకాయల అన్నీ సెక్షన్లకీ కలపీ ఒకే పార్టీ గ్రాండుగా చేద్దాము అని కుమారస్వామి ఐవోరు ప్లాను చేసినాడు. మనిషికి ఐదు రూపాయలు వసూలు చేపిచ్చి ఇస్కూలు డబ్బులు రొన్ని కలిపి ఒక స్వీటు కాడ రెండు స్వీట్లు, ఒక కారా కాడ ఇంక రొంత బూందీ, కూల్‌డ్రింకు బదులుగా బాదంకీరు పెట్టి ఈ పార్టీని మేమందరం మర్చిపోకుండా ఉండేలా ఆరాటం పడతా ఉన్నాడు.

ఆ ఆరాటం చూసి అసలికే గ్రాండు పార్టీగదా ఆ పార్టీకి ఎట్టాంటి గ్రాండు గుడ్డలు కట్టు కొని అదరనూకుదామా అని నేను టెన్షను పడతా ఉంటే కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడొచ్చి కొత్త టెన్షను పెట్టినాడు.

'మావా. ఆటోగ్రాపులు అనేటియి ఒకటుంటాయి. వాటి సంగతి ఏంది మావా' అన్నాడు వాడు.

ఎంతైనా రెడ్ల పిల్లోడు, రొంత చదువుకున్నోడు గదా వాడికి యిట్టాంటియి తెలుస్తాయి.

'ఆటోగ్రాపులా. అంటే ఏందిరా?' అన్నాను నేను.

'అదేరా. ఇప్పుడు మన ఫ్రెండ్సుందరం టెన్తు నుంచి విడిపోతా ఉన్నాము గదా. విడిపోయే ముందర ఇట్టాంటి ఫేర్‌వెలు పార్టీలో ఆటోగ్రాపులు యిచ్చుకుంటాం ఒకరికొకరం. ఆటోగ్రాపు పుస్తకాల్లో 'ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రెండ్ ఇన్ డీడ్' లాంటి కొటేషన్లు రాసి, సంతకం పెట్టి వొచ్చినా రాకపోయినా కళ్లమ్మట నీళ్లు పెట్టుకుని వాటేసుకుని బాయ్ చెప్పుకుంటాం. అది ఆనవాయితీ మావా' అన్నాడు వాడు.

నా గుండెల్లో రాయి పడింది. ఆటోగ్రాపులు కావాలంటే చేతికి అడ్డం లేకుండా ఎన్నయినా పెడతాముగానీ ఆటోగ్రాపు బుక్కు యాణ్ణుంచి కొనేది?

'ఒరే.. ఏందిరా ఈ కొత్త టెండరా?' అన్నాను వాడితో.

'నువ్వు మరీరా. ఆటోగ్రాపు బుక్కు కొనుక్కోలేకపోతే ఏదో ఒక నోటు బుక్కులో సంతకాలు పెట్టించుకో. నామర్దా ఏమీ లేదు. ఇంపార్టెంటు ఏందంటే ఆటోగ్రాపు పెట్టించుకున్నామా లేదా అనేదే' అన్నాడు వాడు.

నేను ఆలోచన చేసి 'ఇట్టగాదుగానీ ముందర కందులుగాణ్ణీ, కాండూరిగాణ్ణీ కలుద్దాం పదా. వాళ్లతో మాట్లాడినాక అప్పుడు డిసైడు చేద్దాం పదరా' అన్నాను.

ఇద్దరం కలిసి కందుల వాళ్లింటికి, కాండూరి వాళ్లింటికీ పొయ్యి వాళ్లిద్దరిని కూడా తీసుకొని పోలేరమ్మ బండ మీద కూచున్నాం.

ఆటోగ్రాపు పుస్తకాల ప్రస్తావన రాంగానే కందులుగాడు మా మాటలకి అడ్డం పడి 'ఒరే... అదంతా నాకు తెలుసురా. ఈ పాటికే నేను ఆటోగ్రాపు బుక్కుతోపాటు కొటేషన్లు కూడా రెడీ చేసి పెట్టుకున్నానురా' అన్నాడు.

'ఏం కొటేషన్లురా' అన్నాడు శ్రీదరుగాడు.

వాడు కొంచెం బెట్టు చేసి, 'మీగ్గాబట్టి చెప్తా ఉన్నానుగానీ మీరు నా కొటేషన్లు కాపీ కొట్టేదానికి లేదురా' అన్నాడు.

'అదంతా తర్వాత సంగతిరా. ముందు కొటేషన్లు చెప్పరా' అన్నాను నేను.

'ఒకటి– ఆల్ దట్ గ్లిట్టర్స్ ఈజ్ నాట్ గోల్డ్. రెండు– ఎ బర్డ్ ఇన్ ద హ్యాండ్ ఈజ్ వర్త్ టు ఇన్ ద బుష్. మూడోది అసలు సిసలైనది– సమ్‌లైక్ గోల్డ్‌షిప్, సమ్‌లైక్ సిల్వర్‌షిప్, బట్ ఐ లైక్ ఫ్రెండ్‌షిప్– ఇవిరా నా కొటేషన్లు' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

నాకు కడుపు కాలిపోయింది అయ్యన్నీ యింటా ఉంటే. నాపాటికి నేను గుడ్డల టెన్షనులో ఉంటే యీడు మూడో కంటికి తెలియకుండా కొటేషన్లు బట్టీకొట్టి రేపు పిలకాయల కాడ మార్కులు కొట్టేద్దామని చూస్తా ఉన్నాడుగదా అనుకొని–

'ఒరే.. మురళీగా నీ సంగతి ఏందిరా' అన్నాను.

'మావా. నాకు కొటేషన్లు ఏమీ తెలియవురా. ఒకటి మాత్రం మా నాయన చెప్తా ఉంటాడు. అది రాస్తాను. ఏందంటే- డోన్ట్ సిట్ లైక్ ఎ రాక్, వర్క్ హార్డ్ లైక్ ఎ క్లాక్. ఇది నా మనసుకు ఎంతో నచ్చిందిరా. అందరికీ ఇది రాసి సంతకం పెడతానురా' అన్నాడు వాడు.

'ఇంకొకటి కూడా ఉండాలిరా. ఇంగిలీషులో గుర్తుకి రావడం లేదుగానీ తెలుగులో దాని అర్థం ఏందంటే- జీవితం సముద్రము వంటిది. స్నేహమనే నావలో దానిని దాటుము- ఇదిరా మీనింగు' అన్నాడు మళ్లీ.

'అబ్బా. ఇదేదో బాగానే ఉందిరా. శ్రీదరా. కొటేషన్లు ఇంగిలీషులోనే రాయాలంటరా. తెలుగులో రాస్తే ఎవరైనా కొడతారంటరా?' అన్నాను.

'ఎవరూ కొట్టరురా. తెలుగులో కూడా రాయొచ్చురా' అన్నాడు శ్రీదరుగాడు.

'అయితే ఇట్టాంటి కాపీ కొటేషన్లు ఎందుకురా. మనమే సొంతంగా కొటేషన్లు కనిపెడదాం. అయి రాద్దాం. జీవితం అనే వర్డుని బేసుగా తీసుకొని కొటేషన్లు చెబుదాముర' అన్నాను నేను.

'సరేరా' అన్నారు అందరు.

కాసేపు గమ్ముగా కూచొని ఆలోచించినాము.

ముందుగా మురళీగాడు అన్నాడు. 'మావా. నేను వైష్ణవుల పిల్లోణ్ణి కాబట్టి మా తాతతో బృందావనానికి పోయి కర్పూరం హారతి యిస్తా ఉంటాను గాబట్టి ఆ మాటల్లోనే చెప్తాను రా. అదేందంటే- జీవితమనే కర్పూరమును హారతిలా వెలిగించునదే స్నేహం. ఎట్టా ఉందిరా?' అన్నాడు వాడు.

'అబ్బ. అదిరిపోయిందిరా. నిజంగానే బాగుందిరా' అన్నాము అందరం.

మాలకొండరావు అందుకున్నాడు. 'మావా. మా నాయన ఇళ్ళు కట్టే బేల్దారు మేస్త్రీ కాబట్టి ఆ మాటల్లోనే చెప్తాను మావా. అదేందంటే- జీవితమనే ఇంటికి ముందరి గడప అమ్మ, ఎనకుండే గడప నాయన. గాలి ఆడేదానికి మనం పెట్టుకునే కిటికీలే స్నేహితులు- ఎట్టుందిరా?'... అన్నాడు వాడు.

'సూపర్. యిజిల్స్ మోగిపోతా ఉన్నాయిరా' అన్నాను నేను.

ఇప్పుడు కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు అందుకున్నాడు.

'ఒరే మా నాయన కరెంటు స్తంబాలు పాతి పెట్టించే కాంట్రాక్టరు కాబట్టి నాక్కూడా ఒకటి తడతా ఉందిరా. అది ఏందంటే- జీవితమనే కరెంటు తీగలని నిలబెట్టే స్తంబాలే స్నేహితులు... దీనికేమంటార్రా?' అన్నాడు వాడు.

'చాలా మీనింగుపుల్లుగా ఉందిరా. దీనిని నువ్వు చెప్పావంటే నమ్మలేకపోతున్నాము మావా' అన్నాము అందరం.

ఇప్పుడు నా వంతు. ఎట్టా కరెంటు స్తంబాల ప్రస్తావన వొచ్చింది గాబట్టి మా నాయన కూడా కరెంటు పని చేసే ఎలక్ట్రీషియను గాబట్టి నేను కూడా ఆ మాటల్లోనే అందుకన్నా.

'శ్రీదరా. నువ్వు చెప్పిన దానికి ఎక్స్‌టెన్షను చెప్తాను చూడు. అది ఏందంటే- ఏకాంతముగా ఉండు జీవిత తీగల పైన ఆప్యాయముగా వచ్చి వాలు పిట్టలే స్నేహితులు. ఇదిరా నా కొటేషను...' అన్నాను.

నా కొటేషను దెబ్బకి వాళ్లంతా ఆరాదనగా చూసినారు నా వైపు.

అ తర్వాత అందరం నీది బాగుంది అంటే, నీది బాగుంది అని ఒకరినొకరం మెచ్చుకుంటా కూచున్నాం.

'మావా. అయితే ఒకటి. నాకు తెలిసి ఇట్టా కొటేషన్లు రాసుకొని ఆటోగ్రాపులు ఇచ్చుకునేది దూరం ఫ్రెండ్సుగానీ దగ్గర ఫ్రెండ్సు కాదురా. మనం వేరే వాళ్లకి సంతకాలు పెడదాముగానీ మనకు మనం ఆటోగ్రాపులు ఇచ్చుకోవద్దురా. ఇచ్చుకుంటే నిజంగానే విడిపోతామంటరా' అన్నాడు కాండూరి మురళీగాడు.

'అవునురా. నేను కూడా విన్నానురా. క్లోజ్ ఫ్రెండ్స్ ఆటోగ్రాపులు యిచ్చుకోకూడదంటరా' అన్నాడు శ్రీదరుగాడు.

'అమ్మో. అట్టయితే మన నలగురం వేరేవాళ్లకి పెడదాముగానీ ఒకరికొకరం యిచ్చుకోవద్దురా' అన్నాను నేను.

పార్టీ రోజు వొచ్చింది. బాస్కెట్ బాలు కోర్టులో ఐవోర్లు, టీచర్లు, ఆఫీసు రూము స్టాఫు, గెంట కొట్టే బాష, కుమారస్వామి ఐవోరు, టెన్తు కిలాసు పిలకాయలమందరం జమ అయినాం.

కుమారస్వామి ఐవోరు మొదలు మైకు ముందరికొచ్చి నిలబడినాడు. మనిషి చాలా ఇదిగా ఉన్నాడు.

'డియర్ స్టూడెంట్స్'... ఒరే గిరే అనకుండా ఫస్ట్‌టైము ఆయనట్టా పిలవడం.

'ఈ రోజు మీ జీవితములో మరపురాని రోజు. హైస్కూలు చదువుతో, మన ఇశ్కోదయతో మీ అనుబంధం ముగిసిపోతా ఉన్న రోజు. ఇంక మీరు ప్రిపరేషను హాలిడేస్ మీద పోబోతా ఉన్నారు. మద్యలో హాల్‌టికెట్ల కోసరం వొచ్చినా, మార్కుల లిస్టు కోసరం వొచ్చినా మనందరం కలుస్తామో లేదో మాట్లాడుకోబోతామో లేదో. అందుకనే ఈ రోజున మనం హాయిగా మాట్లాడుకుందాం. ఇంతకాలం మీరు మా దగ్గర ఉన్నారు. మేం మీకు పాటాలు చెప్పినాం. ఒకరు మెత్తగా చెప్పినాం. ఒకరు గట్టిగా చెప్పినాం. ఒకరం తిట్టినాం. ఒకరం కొట్టినాం. ఎవరం ఏం చేసినా మేమందరం మీ బాగు కోరే చేసినాం. తొందరపాటులో కోపాలలో ఒక్కోసారి మా వల్ల కూడా తప్పులు జరిగి ఉండవచ్చు. కానీ మేమెప్పుడూ మీకు పగవాళ్లం కాము. మీరు వృద్దిలోకి వస్తే కడుపు నిండా సంతోషపడేవాళ్లమే గానీ మీ నుంచి ఆశించేవాళ్లమూ గాదు. రేపు మీరు ఇంజనీర్లయ్యి డాక్టర్లయ్యి పెద్ద పెద్ద ఆపీసర్లు అయినాక మమ్మల్ని, మీకు చదువు చెప్పిన ఈ ఇస్కూలిని మర్చిపోబాకండి. మేము ఎదురుపడినప్పుడు పక్కకి తొలిగిపోకుండా– సార్. ఇదిగో నేను పలానా. మీరు ఆ రోజున అట్టా సాదటం వల్ల యిదిగో యిట్టా ప్రయోజకుణ్ణయ్యాను అని చెబితే అదే మాకు లక్ష రూపాయలు. మీరు పెద్దోళ్లయ్యి మా బుజాల పక్కన బుజాలు రాసుకుంటూ నిలబడినప్పుడు అదే మాకు నిజమైన సంతోషము'....

ఆయన మాట్లాడటం ఆపి, కళ్లద్దాలు తీసి, కర్చీపుతో కళ్లు ఒత్తుకున్నాడు.

మా కళ్లు కూడా ఎర్రంగా అయినాయి. పక్కోళ్లకి అవుపించకుండా ఎవరికి వాళ్లం తలకాయలు వొంచుకుని కళ్లల్లో నీళ్లు నింపుకున్నాం.

అంతలోనే ఆయన మమ్మల్ని నవ్వించేదానికి 'ఒరే యిప్పుడు నాదొక కవితరా. అంటే ఫేర్‌వెలు సందర్భంగా నా కొటేషను అన్నమాట. ఏందంటే–

'విశ్వోదయ బాలలు విశ్వాన పిడుగులు

ఎందెందు ఉండినా వెలిగింతురు జ్యోతులు'

అందరం నవ్వుకుంటా హుషారుగా చప్పట్లు కొట్టినాం.

గుడ్‌లక్ చెప్పి ఉపన్యాసం ముగించాడు ఆయన.

పార్టీ మొదలయ్యింది.

పాడేవాళ్లు పాడతా ఉన్నారు. తినేవాళ్లు తింటా ఉన్నారు. ఆటోగ్రాఫులు యిచ్చుకునే వాళ్లు యిచ్చుకుంటా ఉన్నారు. మాటలు చెప్పుకునేవాళ్లు చెప్పుకుంటా ఉన్నారు.

మేము నలుగురం కూడా మా కాడికి వచ్చిన వాళ్లకి ఆటోగ్రాఫులు ఇస్తా, మేము కూడా వేరే వాళ్ల కాడికి పొయ్యి ఆటోగ్రాఫులు పెట్టించుకుంటా బిజీ బిజీగా తిరిగినాము.

మా డ్రాయింగ్ ఐవోరు బొమ్మేసి మరీ ఆటోగ్రాఫులు యిస్తే మా హిందీ ఐవోరు హిందీ లోనే ఆశీర్వాద్ ఇచ్చినాడు. తెలుగు చెప్పే నరసయ్య ఐవోరికి పద్యాల పిచ్చి కాబట్టి అడిగి నోళ్లందరికీ కాదనకుండా ఒక నీతి పద్యం రాసి సంతకం చేసినాడు. జీవశాస్త్రం బి.సుదాకర్ ఐవోరు, బౌతికశాస్త్రం సి.సుదాకర్ ఐవోరు మా అందరితో పిలకాయల్లాగా కలిసిపోయినారు. జె.నాగేశ్వరరావు ఐవోరు ఊరికే ఉండకుండా ఆయనకిష్టమైన 'యాతమేసి తోడినా ఏరు ఎండదు' పాడి మమ్మల్ని ఏడిపించినాడు.

ఎంత మంచి ఫేర్‌వెలు పార్టీ. నిజంగానే ఎంత మంచిరోజు.

అందుకనే పిలకాయలకి హైస్కూలు అనేది ఒకటి ఉండాల. ఉన్నా దాంట్లో మంచి మంచి ఐవోర్లు ఉండే బాగ్యం అనేది ఒకటి ఉండాల. ఉన్నా వాళ్లతో ఆడీపాడీ వాళ్లు మనల్ని, మనం వాళ్లనీ గుర్తు పెట్టుకునే బాందవ్యం అనేది ఒకటి ఉండాల. గుర్తుకు తెచ్చుకుంటే అదంతా తీపీకారంగా హాయిహాయిగా ఉండాల. అప్పుడు గదా–

'జీవితం అనే పుస్తకంలో బ్యూటిఫులు చాప్టరే హైస్కూలు'... అని అందరం కొటేషను కొట్టగలిగేది.

■